పెంచిన బస్సు చార్జీలను ఉపసంహరించుకోవాలి

గౌలిపురా: హైదరాబాద్ పరిధిలో నడిచే బస్సుల్లో రూ.5, రూ.10 చొప్పున చార్జీలను పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో పేద, మధ్య తరగతి ప్రయాణికులపై పెనుభారమేనని భారత కమ్యూనిస్టు పార్టీ హైదరాబాద్ జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యుడు గడ్డమీది చంద్రమోహన్‌గౌడ్ ఆరోపించారు. ఇప్పటికే అదుపు లేకుండా పెరిగిపోతున్న నిత్యావసర ధరలతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. నిన్న విద్యార్థుల బస్‌పాస్ చార్జీలు, నేడు బస్సు చార్జీలను పెంచుతూ సామాన్య ప్రయాణికుల నడ్డి విరుచడమేనని విమర్శించారు. సాధ్యం కానీ హామీలతో అధికారంలోకి వచ్చి మౌలిక సదుపాయాల సాకుతో ప్రయాణికులపై భారం వేయడం సబబు కాదన్నారు. ప్రభుత్వం పెంచిన బస్సు చార్జీలను ఉపసంహరించుకోవాలన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి


రాకేష్ జైస్వాల్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

సుల్తాన్‌బజార్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ సూచించారు. సోమవారం గౌలిగూడలోని ఓ పాఠశాలలో పర్యావరణం పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాకేష్ జైస్వాల్ హాజరై పర్యావరణం పరిరక్షణపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. సమాజంలో పరిశుభ్రత, పచ్చదనం ఎంతో అవసరమని ఇలాంటి నియమాలు పాటిస్తేనే ఆరోగ్యకరమైన సమాజం ఉంటుందన్నారు. అనంతరం ఆయన జన్మదినం సందర్భంగా విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు.

తలసానికి సన్మానం



నాంపల్లి: రాష్ట్ర మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌ఛార్జ్ సీహెచ్ ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ..బీఆర్‌ఎస్ హయాంలోనే నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నలుమూలలా కోట్లాది రూపాయాల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. మాజీ మంత్రి తలసాని నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి పదేళ్ల పాటు అండగా ఉండి ప్రజలకు ఎంతో అభివృద్ధి చేశారని కొనియాడారు.


ఘనంగా ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందజేసి సత్కరించిన ప్రొ. శ్రీరామ్ వెంకటేష్

అబిడ్స్: సమాజంలో ఉపాధ్యాయ పాత్ర అమూల్యమైనదని తెలంగాణ ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్ పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సంవత్సరం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న ప్రిన్సిపాల్ కె.శ్రావణి, మహ్మద్ ముబాషీర్ మొయినుద్దీన్, డాక్టర్ కల్యాణ్ చక్రవర్తికి శాలువాలు కప్పి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్ ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జి.వేణుగోపాల్, సూర్య, ఫాతీమా, కుమారి, ఖుషితో పాటు పలువురు లెక్చరర్లు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా


కౌన్సెలింగ్ చేస్తున్న ఏసీపీ సుదర్శన్

అబిడ్స్: రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంటుందని గోషామహల్ డివిజన్ ఏసీపీ ఎస్. సుదర్శన్ పేర్కొన్నారు. సోమవారం గోషామహల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చి హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని, అసాంఘిక కార్యకలాపాలు చేపడితే జైలు వెళ్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గోషామహల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఎస్సైలు లక్ష్మయ్య, రాజు, అరుణోదయ, అరవింద్ పాల్గొన్నారు.

11న మాతా విశాల్ జాగరణ

గౌలిపురా: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 11న గౌలిపురాలోని మహంకాళి మాతేశ్వరి భారతమాత ఆలయం, కోట మైసమ్మ ఆలయంలో మాతా విశాల్ జాగరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు ఎర్మనీ కైలాష్ గంగపుత్ర తెలిపారు. అనూప్ కుమార్ భజన మండలి ఆధ్వర్యంలో జాగరణ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. మాతా విశాల్ జాగరణ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

జూ పార్కుకు చేరిన మూడు జీబ్రాలు

గుజరాత్ నుంచి జూ పార్కుకు తరలింపు

బహదూర్‌పురా: జంతు మార్పిడిలో భాగంగా గుజరాత్ జూ నుంచి తెప్పించిన మూడు జీబ్రాలను నెహ్రూ జూలాజికల్ పార్కులో వదిలారు. ఇందుకు బదులుగా పది జతల మౌస్ డీర్‌లను గుజరాత్‌కు ఇచ్చారు. సోమవారం హైదరాబాద్‌నెహ్రూ జూలాజికల్ పార్కులో 71వ ప్రపంచ వన్యప్రాణి వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టిరైలు వద్ద ఏర్పాటు చేసిన సింబా క్యాంటిన్ సహా కొత్తగా నిర్మించిన బేర్‌నైట్ హౌస్‌ను చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ సువర్ణ ప్రారంభించారు. ఎంక్లోజర్‌లో వదిలిన జీబ్రాలు సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి.


మాట్లాడుతున్న చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ సువర్ణ

వారోత్సవాల సందర్భంగా వివిధ అంశాల్లో నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..నెహ్రూ జూలాజికల్ పార్కుకు ఏటా 25 లక్షల మంది సందర్శకులు వస్తుంటారని చెప్పారు. జంతు మార్పిడిలో భాగంగా గుజరాత్‌లోని జాంగసర్ జూ నుంచి తీసుకొచ్చిన మూడు జీబ్రాలను ఎంక్లోజర్‌లో విడుదల చేసినట్లు తెలిపారు. ఇందుకు బదులుగా ఇక్కడి పది మౌస్ డీర్లను వారికి అప్పగించినట్లు తెలిపారు. వైల్డ్ లైఫ్ చీఫ్ వార్డెన్ పీసీసీఎఫ్ ఎలూ సింగ్ మేరు, డైరెక్టర్ డాక్టర్ సునీల్ ఎస్ హీరేమత్, తెలంగాణ ప్రొటెక్షన్ సీసీఎఫ్ డాక్టర్ రామలింగం, పీసీసీఎఫ్ ఓఎస్డీ ఏ శంకరన్, జూ పార్కు క్యూరేటర్ జే వసంత, కేపీఎస్ బాబు, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మహ్మద్ అబ్దుల్ హకీమ్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ క్యాంటీన్లు పేద ప్రజలకు వరం

అబిడ్స్: పేద ప్రజలకు ఇదిరమ్మ క్యాంటీన్లు ఒక వరంలాంటిదని తెలంగాణ రాష్ట్ర ఫిషరీష్ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. సోమవారం జీహెచ్‌ఎంసీ అబిడ్స్–14వ సర్కిల్ పరిధిలోని అఫ్జల్‌గంజ్ లైబ్రరీ వద్ద నూతన ఇందిరమ్మ క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ లేని విధంగా జీహెచ్‌ఎంసీ పరిధిలో కేవలం రూ.5కే రుచికరమైన టిఫిన్లు, రుచికరమైన భోజనాలు అందిస్తున్న ఘనత, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వానిదే అన్నారు. అన్ని వర్గాల ప్రజల ఆకలి తీర్చేందుకు ఇందిరమ్మ క్యాంటీన్లను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ముందుకు తెచ్చిందన్నారు. ఉదయం, మధ్యాహ్నం వేళల్లో టిఫిన్లు, భోజనాలు నాణ్యమైనవి అందిస్తామని మెట్టు సాయికుమార్



అఫ్జల్‌గంజ్ లైబ్రరి వద్ద ఇందిరమ్మ క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మెట్టు సాయికుమార్, ఉమా ప్రకాష్

పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ–14వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఉమా ప్రకాష్, ఏఎంఓహెచ్ డాక్టర్ వెంకటరమణ, శానిటేషన్ అధికారి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ధరలో బంగారం.. క్యూ కట్టిన కొనుగోలుదారులు

సాక్షి, సిటీబ్యూరో: బంగారం ధరలు ఆకాశమే హద్దుగా పెరిగిపోతున్నాయి. రోజురోజుకీ పెరుగుతున్న ధరలు సోమవారం ఏకంగా ఒకేసారి రూ.10వేలకు హై జంప్ చేశాయి. ఈ నేపథ్యంలో నగరంలోని సిద్ధి అంబర్ బజార్‌లో ఉన్న ఓ షాప్ దగ్గర బంగారం కొనుగోలుదారులు క్యూ కట్టారు. ఈ షాప్‌లో తులానికి రూ.3వేల నుంచి రూ.5వేల వరకూ ధర తగ్గించి విక్రయిస్తారని అందుకే ఇలా క్యూ కట్టారని సమాచారం.

హత్యాయత్నం కేసులో నిందితుడి రిమాండ్

సంతోష్‌నగర్: ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిని సోమవారం కంచన్‌బాగ్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ కమల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హఫీజ్‌బాబానగర్ ఒవైసీ స్కూల్ ప్రాంతానికి చెందిన తాహేర్ బిన్ అబ్దుల్లా బర్రావాజ్ అలియాస్ అహ్మద్ (20) షేక్ సైఫ్‌కు రూ.33 వేలను చేతి బదులుగా ఇచ్చాడు. షేక్ సైఫ్ తాహేర్‌కు రూ.10 వేలు మాత్రమే తిరిగి ఇచ్చాడు. మిగతా డబ్బులు ఇవ్వడానికి కాలయాపన చేస్తున్నాడు. దీంతో షేక్ సైఫ్‌ను అంతం చేయాలని తాహేర్ పథకం వేశాడు. తాహేర్ బిన్ అబ్దుల్లా ఈ నెల 4న సైఫ్‌ను హఫీజ్‌బాబానగర్‌కు రప్పించి మెడ, భుజంపై కత్తితో దాడి చేశాడు. తీవ్ర గాయాలకు గురైన సైఫ్‌ను చికిత్స నిమిత్తం ఒవైసీ ఆసుపత్రికి తరలించారు. సైఫ్ తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితుడు తాహేర్‌ను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

సుప్రీంకోర్టు ఘటనను ఖండించిన తెలంగాణ న్యాయమూర్తుల సంఘం

యాకుత్‌పురా: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై బహిరంగ కోర్టులో జరిగిన దాడిని తెలంగాణ న్యాయమూర్తుల సంఘం అధ్యక్షుడు జి. రాజగోపాల్, ప్రధాన కార్యదర్శి కె.మురళీ మోహన్ సోమవారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ.. భారత సర్వోన్నత న్యాయస్థానంలో ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడితో యావత్ భారత న్యాయ వ్యవస్థపై దాడి చేసినట్లుగా తమ సంఘం భావిస్తుందన్నారు. ఇలాంటి బెదిరింపులు, అవమానాలు, దాడులు, న్యాయ వ్యవస్థను, న్యాయమూర్తులను ఏ కోశానా భయపెట్టలేవన్నారు. ఈ దాడికి పాల్పడిన వారిపై తక్షణమే చర్యలు తీసుకొని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన అవసరముందన్నారు.

రాజాసింగ్‌పై చర్యలు తీసుకోవాలి

చాంద్రాయణగుట్ట: ముస్లింల ఆరాధ్య దైవమైన మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ పీస్ లవింగ్ పర్సన్స్ ఆఫ్ ఓల్డ్ సిటీ, సోషల్ హార్మనీ పౌర సంస్థ ప్రతినిధులు దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రాకు సోమవా రం విన్నవించుకున్నారు. ఈ నెల 5న శాలిబండ పోలీస్‌స్టేషన్‌లో మహ్మద్ అహ్మద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదైన కేసు ఆధారంగా రాజాసింగ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. డీసీపీని కలిసిన వారిలో సలావుద్దీన్ అఫ్సాన్, మహ్మద్ బిన్ ఉమర్, మొయినోద్దీన్ షరీఫ్ తదితరులున్నారు.

పెంచిన బస్సు ఛార్జీలను తగ్గించాలి


కల్యాణ్ నాయక్

అఫ్జల్‌గంజ్: జంటనగరాల్లో ఆర్టీసీ బస్సు ఛార్జీలను కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా పెంచి పేద ప్రజల నడ్డి విరిచిందని తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు డాక్టర్ కల్యాణ్‌నాయక్ పేర్కొన్నారు. జంటనగరాల్లో రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కనీస బస్సు ఛార్జీని రూ.10 పెంచడం కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గపు చర్య అని ఆయన ఆరోపించారు. సోమవారం కట్టెల మండిలోని బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..గత అసెంబ్లీ ఎన్నికల ముందు ఇష్టం వచ్చినట్లు వాగ్దానాలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించి ఆర్టీసీనే దివాలా తీయించారన్నారు. తీవ్ర నష్టాల్లో దివాలా తీసిన ఆర్టీసీని గట్టెక్కించేందుకే బస్సు ఛార్జీలను పెంచిందని ఆరోపించారు. తెలంగాణతో పాటు దేశ నలుమూలలా అన్నివర్గాల ప్రజల మేలును కోరుతూ దేశ ప్రధాని మోదీ ప్రభుత్వం జీఎస్టీని తగ్గించి నిత్యావసర ఇతర పలు రకాల వస్తులపై ధరలు తగ్గించి పేద మధ్యతరగతి ప్రజలకు మోదీ ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ ఛార్జీలను పెంచి విద్యార్థులు, ఉద్యోగులు, దినసరి కూలీలు, ఇతర అన్నివర్గాల ప్రజల నడ్డి విరిచే విధంగా చర్యలు తీసుకోవడం సిగ్గుచేటని కల్యాణ్ నాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే పెంచిన ఆర్టీసీ ఛార్జీలను తగ్గించాలని, లేనిచో పెద్ద ఎత్తున అన్నివర్గాల ప్రజలు ఆందోళనలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారన్నారు.

ఉస్మానియా మెడికల్ కళాశాలకు మంచి పేరు తీసుకురావాలి


ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ రాజారావు తదితరులు

సుల్తాన్‌బజార్: ఉస్మానియా మెడికల్ కళాశాలలో సీటు సంపాదించిన విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారావు అన్నారు. సోమవారం 2025 బ్యాచ్ నూతన విద్యార్థులకు ఓరియన్‌టేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కాలేజీలో సీటు పొందేందుకు విద్యార్థులను ప్రోత్సహించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కళాశాలలో ప్రతివారం సైకియాట్రి డిపార్ట్‌మెంట్ వారిచే పిల్లల్లో మానసిక ధైర్యం పెంపొందించేందుకు క్లాసులు నిర్వహించనున్నట్లు డాక్టర్ పద్మావతి తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగార్జునచారి, ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, సుల్తాన్‌బజార్ ఏసీపీ మట్టయ్య, ఇన్‌స్పెక్టర్ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

‘యశోభూషణం’ పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నేషనల్ విశ్వకర్మ ఎంప్లాయిస్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అటవీశాఖ విశ్రాంత అధికారి ఎన్‌వీ రఘువీర్ ప్రతాప్ రచించిన ‘యశోభూషణం’పుస్తకావిష్కరణ సభ సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ గోరటి వెంకన్న మాట్లాడుతూ..తెలంగాణ సాహిత్య చరిత్రలో సువర్ణ ఘట్టం యశోభూషణం అని కొనియాడారు. సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి మాట్లాడుతూ..వివిధ సాహితీ ప్రక్రియలో రచనలు చేస్తూ 20కి పైగా పుస్తకాలు తీసుకురావడం అభినందనీయమన్నారు. అనంతరం నిర్వహించిన ఎన్‌వీ రఘువీర్ ప్రతాప్ పదవీ విరమణ సభలో ఆయనను పలువురు సాహితీవేత్తలు, సహచర ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్.బాలాచారి, తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పద్మాచారి, విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం అధ్యక్షుడు మదన్ మోహన్‌చారి, సిలువేరు కళాపీఠం అధ్యక్షుడు ఎస్. లింగమూర్తి, సినీ గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్, సాహితీవేత్త సత్యనారాయణ, పోలా సాయిజ్యోతి, మూర్తి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గోరటి వెంకన్న

అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలి

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన కార్వాన్ నియోజకవర్గంలో ఆగిపోయిన అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న పనులు, భారీ వర్షాలకు నియోజకవర్గంలో జరిగిన నష్టాన్ని ఆమెకు వివరించారు. ప్రధాన రోడ్లన్ని వర్షాలకు దెబ్బతిని అధ్వానంగా తయారయ్యాయని ఆయన అన్నారు. అదే విధంగా నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల గోడలు భారీ వర్షాలకు కూలాయన్నారు. కుల్సుంపురా, గోల్కొండ, లంగర్ హౌస్, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కాగా సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ ఆయనకు హామీ ఇచ్చారు.


కలెక్టర్ హరిచందనతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

‘దైవభక్తితో సన్మార్గం వైపు పయనించవచ్చు’

గోల్కొండ: దైవభక్తితో సన్మార్గం వైపు పయనించవచ్చునని ఆఫిజ్ రహమత్ ఉల్లా తయ్యబ్ అన్నారు. సోమవారం షేక్‌పేట్ తేజా కాలనీలోని అన్సారీ మసీదులో హత్‌మే నుబువత్‌పై ఒకరోజు వర్క్ షాప్ జరిగింది. మజ్లిస్ తహఫూజ్ హత్‌మే నుబువత్ టోలిచౌకీ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య వక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆధ్యాత్మిక విషయాలు నమాజ్ చదవడం, మహ్మద్ ప్రవక్త జీవితంపై ప్రవచనాలు లాంటి కార్యక్రమాలు నేటి యువతకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అజ్రత్ మౌలానా షా మహ్మద్, జమాల్ ఉర్ రహమాన్, మౌలానా మహ్మద్ అర్షద్ అలీ, మౌలానా మహ్మద్ మూసాఖాన్ నద్వీ, మౌలానా సయ్యద్ ఎంహెచ్ ఉసామీ, మహ్మద్ ముస్తాఫా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆఫిజ్ రహమత్ ఉల్లా తయ్యబ్

‘రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పతనం ఖాయం’


మాజీ మంత్రి తలసానితో శేఖర్‌రెడ్డి

గోల్కొండ: రాష్ట్రంలో అవినీతి కాంగ్రెస్ పార్టీ పతనం ఖాయమని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నాయకుడు తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. కార్వాన్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఏ.శేఖర్‌రెడ్డి సోమవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి గజమాలతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల పాలనలో మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ రూపురేఖలను మార్చేసి దేశంలోనే ఆర్థికంగా బలీయమైన రాష్ట్రంగా తీర్చిదిద్దారన్నారు. హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ నగరంగా గుర్తింపు తెచ్చింది కేటీఆర్‌యే అని ఆయన గుర్తుచేశారు. నేడు సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణను పూర్తిగా దివాలా తీసిన రాష్ట్రంగా తయారు చేశారని ఆరోపించారు. ఆయనను కలిసిన వారిలో శ్రీధర్‌సాగర్, సురేందర్ రెడ్డి, చిరు, వెంకటేష్ తదితరులున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

చార్మినార్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని జీహెచ్‌ఎంసీ చార్మినార్ ఇన్‌చార్జి జోనల్ కమిషనర్ సీఎన్. రఘు ప్రసాద్ అన్నారు. ఇందులో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. నర్కిపూల్ బాగ్‌లోని జోనల్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట్, రాజేంద్రనగర్ సర్కిళ్ల సంబంధించిన అక్రమ నిర్మాణాలపై 2 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ డి.శంకర్ సింగ్, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి.


ఫిర్యాదులను స్వీకరిస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

ఏఎంసీ రాజారావు, టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ మహమ్మద్ అబ్దుల్ మాజీద్, మలేరియా ఎస్ఈ నామాల శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఈఈ సతీష్‌రెడ్డి, బిల్ కలెక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య శిబిరంలో ఫజల్ ఉర్ రెహమాన్ ఖుర్రం, వైద్యులు

చార్మినార్: ఆరోగ్య పరిరక్షణలో ప్రజలు జాగ్రత్త పడాలని జెడ్‌ఎం మల్టీ స్పెషాలిటీ క్లినిక్స్ డైరెక్టర్, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ముదస్సిర్ అన్నారు. జెడ్‌ఎం మల్టీస్పెషాలిటీ క్లినిక్స్, ఆలీవ్ ఆసుపత్రిల సంయుక్తాధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి ఆయన అధ్యక్షతవహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వయస్సుతో నిమిత్తం లేకుండా హృద్రోగ వ్యాధులు విపరీతంగా పెరగడంతో పాటు హార్ట్ ఎటాక్‌లు రావడం ఆందోళన కలిగిస్తుందన్నారు. డాన్ విద్యాసంస్థల చైర్మన్ ఫజల్ ఉర్ రెహ్మన్ ఖుర్రం మాట్లాడుతూ..జీవితాంతం ఆరోగ్యంగా ఉండేందుకు బాల్య దశ నుంచి ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఫాతిమా నాసిర్, డాక్టర్ జాహీదుల్లా ఖాన్, డాక్టర్ జుబేరియా తరన్నుం, డాక్టర్ లోహితేష్ పాల్గొన్నారు.

చైన్ స్నాచర్ల రిమాండ్

నాంపల్లి: చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరిని రిమాండ్‌కు తరలించిన ఘటన హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్ ఆసిఫ్ నగర్ ఏసీపీ బి.కిషన్‌కుమార్, హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తమ్‌రావు, డీఐ సైదులుతో కలిసి వివరాలను వెల్లడించారు. అఫ్జల్‌సాగర్‌లో దరమోళ్ల నాగమణి, దరమోళ్ల వాజ్రాయ దంపతులు అల్లం, వెల్లుల్లి వ్యాపారం చేస్తుంటారు. ఈ నెల 4న నాగమణి (58)ఒంటరిగా ఉండగా గుర్తుతెలియని వ్యక్తి అల్లం కొనుగోలు చేస్తున్నట్లు నటిస్తూ ఆమె మెడలోని 2.6 గ్రాముల బంగారు పుస్తెలతాడును తెంచుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించగా మాన్గార్ బస్తీలో మహ్మద్ సద్దాం(32), ఉపాడే శివ(31) ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా చైన్ స్నాచింగ్ చేసినట్లు ఒప్పుకోవడంతో ఇరువురిని రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసును ఛేదించిన క్రైమ్ టీమ్ సిబ్బందిని డీసీపీ అభినందించారు.


వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ చంద్రమోహన్

యువత భారతీయ కళలు, సంస్కృతిని అలవర్చుకోవాలి


ముఖ్యఅతిథులతో కళాకారులు

సుల్తాన్‌బజార్: భారతీయ కళలు, సంస్కృతిని నేటి యువత అలవర్చుకోవాలని ప్రముఖ నాట్య గురువు శ్రీనివాసరావు అన్నారు. ఫ్యూచర్ టీచర్ అకాడమీ వార్షికోత్సవ వేడుకలు సోమవారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా కళా సంఘం–2025 పేరిట నిర్వహించిన వివిధ నాట్యాలు నృత్య గురువుల పర్యవేక్షణలో కళాకారులు ఎంతో అద్భుతంగా చేశారు. ముఖ్యంగా నవదుర్గల నాట్య రూపకం ఎంతో రంజింప చేసింది. ఫ్యూచర్ టీచర్ అకాడమీ వ్యవస్థాపక డైరెక్టర్ భరత నాట్యం గురువు డాక్టర్ రేవతి ప్రసాద్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరై గురువును శ్రీనివాసరావు, సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞ శర్మ, ప్రముఖ సినీనటులు సంధ్యాజనక్, జబర్దస్త్ ప్రేమ్ అప్పారావు, కళాకారులకు వివిధ మెమొంటోలతో సత్కరించారు.

సమాజ నిర్మాణంలో ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర కీలకం

గోల్కొండ: సమాజ నిర్మాణంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పాత్ర కీలకమని దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్ ప్రముఖ్ భాస్కర్ జీ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో గోల్కొండ బాగ్ కార్వాన్ నగర్ రాంసింగ్ పురా బస్తీలో విజయ దశమి ఉత్సవాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..డాక్టర్ కేశవరావు బలిరామ్ హెగ్డేవార్ ఎంతో ముందు చూపుతో ఆర్‌ఎస్‌ఎస్‌ను స్థాపించారన్నారు. భారతీయ సంస్కృతి, పరిరక్షణకు నిరంతరం సంస్థ పని చేస్తుందన్నారు. భవిష్యత్తు తరాలకు మన సంస్కృతి, సంప్రదాయాలను ఇవ్వడమే కాకుండా వారిలో స్ఫూర్తి నింపడమే లక్ష్యంగా ఆర్‌ఎస్‌ఎస్ పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఎస్‌ఐటీ విద్యా సంస్థల చైర్మన్ బండారి వెంకటేష్, నగర సంఘ చాలక్ చాట్ల వజ్రలింగం, బస్తీ ప్రముఖ్ జొన్నకుంటి మధుసూదన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్ ప్రముఖ్ భాస్కర్ జీ

ప్రతిభావంతులైన విద్యార్థులకు అజ్మత్ జా అవార్డులు

సాక్షి, సిటీబ్యూరో: చారిత్రక పురానీ హవేలీ ప్యాలెస్‌లో సోమవారం ముకరంజా స్కూల్ 38వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొమ్మిదో నిజాం, వాలాషాన్ అజ్మత్ జా బహదూర్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకకు రాకుమారి షాహ్కర్ జా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అద్భుత ప్రతిభ కనబర్చిన 40 మంది విద్యార్థులకు ‘రాకుమారి ఇస్రా జా’, ‘రాకుమారి షాహ్కర్ జా’, ‘వాలాషాన్ అజ్మత్ జా బహదూర్ అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వ మాజీ కార్యదర్శి నైర్బ ప్రసాద్ మాట్లాడుతూ హైదరాబాద్ విద్యా, సాంస్కృతిక రంగాల్లో ముకరంజా స్కూల్ పోషిస్తున్న కీలకపాత్రను కొనియాడారు. విద్యార్థుల విజయాలను గౌరవించే ఈ సంప్రదాయం, యువ ప్రతిభను ప్రోత్సహించడం, క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడంలో పాఠశాల దార్శనికతను ప్రతిబింబిస్తుందన్నారు. పాఠశాల వ్యవస్థాపకులైన 8వ నిజాం, అజ్మత్ వాలాషాన్ ముకరం జా బహదూర్ దాతృత్వం, విద్యా ఆసక్తిని గుర్తు చేసుకున్నారు. ఎనిమిది మహల్స్, ఇతర ఆస్తులతో కూడిన అద్భుతమైన పురానీ హవేలీని విద్యావ్యాప్తి కోసం దానం చేసిన ఆయన దార్శనికత నేటికీ లక్షలాది మందికి స్ఫూర్తిగా నిలుస్తోందని అన్నారు. కార్యక్రమంలో ట్రస్టీలు ఎం.ఎ. బాసిత్, నవాబ్ ఎం.ఎ. ఫైజ్ ఖాన్, ఖలీల్ అహ్మద్ , నవాబ్ ఎం.ఎఫ్. ఫైజ్ బిన్ జంగ్, సెక్రటరీ కల్నల్ ఎస్.ఎండిపున్, ప్రిన్సిపాల్ రేఖా వడేలు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను చెల్లించని వారి దుకాణాలు సీజ్


ఆస్తిపన్ను చెల్లించని దుకాణాలు సీజ్ చేస్తున్న దృశ్యం

అబిడ్స్: జీహెచ్‌ఎంసీ అబిడ్స్–14వ సర్కిల్ పరిధిలో ఆస్తిపన్ను చెల్లించని పలువురు వ్యాపారుల దుకాణాలను జీహెచ్‌ఎంసీ అధికారులు సీజ్ చేసేందుకు శ్రీకారం చుట్టారు. సర్కిల్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పాత బకాయాలు చెల్లించని వారికి సర్కిల్ పరిధిలో డిప్యూటీ కమిషనర్ ఉమాప్రకాష్ పర్యవేక్షణలో ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్‌లు ముందుగా నోటీసులు జారీ చేస్తున్నారు. వారం పది రోజుల్లో ఆస్తిపన్ను చెల్లించకుండా నోటీసులకు స్పందించని వ్యాపార దుకాణాలను సీజ్ చేస్తున్నారు. సోమవారం ఒకే టీపీఐఎన్ నెంబర్‌పై 10కి పైగా దుకాణాలను నడిపిస్తూ జీహెచ్‌ఎంసీకి పెద్ద ఎత్తున బకాయి పడి ఆస్తిపన్ను చెల్లించని వ్యాపార సంస్థలను డిప్యూటీ కమిషనర్ ఆధ్వర్యంలో ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు సీజ్ చేశారు. బొగ్గులకుంటలోని పలు వ్యాపార దుకాణాలను సీజ్ చేశారు. రూ.80 లక్షల ఆస్తిపన్ను చెల్లించేది ఉండగా రూ.40 లక్షలను వారంలోగా ఇస్తామని వ్యాపారులు చెక్కులు అందజేసి హామీ పత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ..ఈ ఏడాది తమ సర్కిల్‌కు రూ.85 కోట్ల టార్గెట్ ఉన్నదని వివరించారు. సంబంధిత అధికారులు సిబ్బంది సహకారంతో సకాలంలో టార్గెట్ పూర్తి చేస్తామన్నారు.

ట్రాన్స్‌పోర్టులు, ఇతర కార్యాలయాలకు నోటీసులు..

సర్కిల్ పరిధిలోని ఆస్తిపన్ను చెల్లించని ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు, పలు వ్యాపార సంస్థలకు నోటీసులు జారీ చేస్తున్నామని డిప్యూటీ కమిషనర్ ఉమాప్రకాష్ వెల్లడించారు. ప్రతిరోజూ కొన్ని పర్యటించి పాత బకాయి చెల్లించని వారికి ముందుగా నోటీసులు జారీ చేసి ఆస్తిపన్ను చెల్లించని వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నామన్నారు.